గుండెలదిరిపోయే అపరాధ పరిశోధన

# హత్యాశ్చర్యం లేక అంతకుడి క్లూ

టి. వి. శంకరమ్

క్రూరనారి రసపట్టులో అంతరాయం – మతిమరుపు అసిస్టెంటు – సర్జుమీద క్లూలు — దెబ్బతిన్న జాగీలం – హత్యచుట్టూ మిష్టరీ - చనిపోయిన వ్యక్తి భార్య—ఎవడు హంతకుడు?

నేను మా యింటి గోడ నానుకుని కూచుని "క్రూర నారి" చదువుకుంటుండగా ఎవరో నన్ను "హల్లో, కేయాన్ గారూ," అని పిలిచినట్టయింది. నేను వెంటనే కళ్లు రెండూ గట్టిగా మూసుకుని ఆ పిలిచిన మనిషి ఎవరై ఉంటారా అని తీవ్రంగా ఆలోచనలో పడ్డాను. విన్నగొంతు! ఎక్కడ విన్నానూ? నన్ను "కేయాన్" అని పిలిచే వారెవరూ?

"నేనండీ, భద్రాన్ని! నిద్రపోతున్నారా?"

నాకు మండిపోయింది. ఇంకొక్క పావుగంట ట్రైమిస్తే నేనే కనుక్కునేవాణ్ణిగా! ఇంతలోనే చెప్పెయ్యాలా?

"నువ్వే అయి ఉంటావనుకున్నానులే!" అన్నాను కళ్లు తెరిచి చూస్తూ.

ఇంతలోనే వాడు చేసిన అక్రమం జ్ఞాపకం వచ్చి నాకు భలే కోపంవచ్చింది.

"మళ్ళీ ఏం మొహం పెట్టుకు వచ్చావ్?" అన్నాను.

భద్రం నాకేసి ఆశ్చర్యంతో చూసి, "ఆదేమిటండీ? మధ్య నే నేం చేశానూ?" అన్నాడు.

"ఏం చేసేదేమిటి? నన్ను పోలీసినస్పెక్టరు పిలిచినప్పుడు తీరా నువు వెంట లేకపోతివి."

"మిమ్మల్ని లాకప్ లోన పెట్టారుటగా?"

"ఆ మిష్టరీ ఇంకా తేలలేదు, భద్రం!"

"అందులో మిష్టరీ ఉందా?"

"మిష్టరీ అన్న మిష్టరీయా? అది ఎవరో నా శత్రువులు చేయించిన పని ... తరవాత మా బావ వచ్చాడు. ఇనస్పెక్టరుతో ఏదో చెప్పాడు. ఇనస్పెక్టరు నాతో చాలా మంచిగా మాట్లాడి, ఇక వెళ్ళిరమ్మన్నాడు. ఏవైనా మంచి కేసులు వస్తే నన్ను ట్రంకు చెయ్యమన్నా. చేస్తానన్నాడు నవ్వుతూ. తరవాత నన్ను మా బావ చంపుకు తిన్నాడు. డబ్బేమయింది చెప్పమంటాడు. 'నా అసిస్టెంటుదగ్గర ఉందిలే,' అన్నా. 'వాడు కాజేశాడు! ఇంకేముందీ?' అన్నాడు. ఆయన కసలేం తెలీదు. ఎక్కడన్నా డిటెక్టివు అసిస్టెంట్లు డబ్బు కాజేస్తారూ?"

"వాళ్ళ కదికూడా చాతైయుండాలి, కేయాన్ గారూ!"

"ఇదుగో, నన్ను పరాయివాడల్లే పిలవకూ! ఇతరులు మర్యాదకోసం నన్ను కేయాన్‌గారని పిలవనీ. నువు అంత మర్యాద చేయ్యాల్సిన అవసరం లేదు."

"మరి ఏమని పిలవను?"

"'గురో' అను. కావలిస్తే 'గురోజీ' అను."

"అలాగే, గురోజీ!"

ప్రపంచ డిటెక్టివ్‌ల కూటమిలోకి మన అభిమాన తెలుగు డిటెక్టివ్ కేయాస్ ఆనంద్ ఎలాగ నిర్భయంగా అడుగు పెట్టాడో—

—క్రిందటి వారం చదివారు.

—ఈవారం

అతను పట్టుకున్న మొదటి కేసులోని భయంకర రహస్యాలు చదవండి!

"ఇంతకీ ఆ డబ్బేం చేశావ్?"

"డబ్బా? ఏ డబ్బు?"

"నీకు తగని మతిమరుపు. ఆ సదా ప్రసాదం హోటల్లో నేను నీ చేతికిచ్చినది."

"దాసప్రకాశలో ఇచ్చినదా? అది అప్పుడే పోయిందిగా?"

"పోయిందీ? ఎట్లా పోయిందీ? భద్రంగా ఉంచావనుకుంటినే, భద్రం!"

"అది పిక్కుపాకెట్టయి పోయింది."

"అంటే?"

"ఎవడో చేతో దేశాడు."

"అంటే?"

"జేబులో చెయిపెట్టి కాజేశాడు."

"చెయ్యి అమాంతం పట్టెయ్యలేకపోయినా? నేనువచ్చి వెధవను డిటెక్షను చేసి పారేసేవాణ్ణిగా?"

"ఇప్పటికైనా చెయ్యాలిసిందే. అదొక మిష్టరీ మన నెత్తిమీద ఉంది... అన్నట్టు మీ నాయనగారు పోయారటగా?"

"అవును, భద్రం ఆసంగతి యెట్లా కనిపెట్టావ్?"

"నాకూ కూడా కొంచెం డిటెక్షను తెలుసండోయ్, గురోజీ!"

నా అసిస్టెంటు ప్రయోజకుడైనందుకు నాకు చాలా ఆనందమేసింది.

"ఇంతకూ మీ నాన్నగారు ఎట్లా పోయిందీ చెప్పారు కారేం?" అన్నాడు భద్రం.

"ఏంలేదు, భద్రం. నాలుగు రోజులు జ్వరం చేసింది. అయిదోరోజు—హతం."

"క్లూలేమీ లేవా?"

"ఏవో ఇంజక్షన్లిచ్చారు."

"ఇంజక్షన్లు కాదు, గురోజీ... క్లూలు! క్లూలు!"

"అటువంటివేమీ లేదులే... భద్రం!"

"ఏం, గురో?"

"క్లూలంటే ఏమిటీ?"

"అవి హంతకులను పట్టుకునే ఆధారాలు!"

"భద్రం! ఒక అక్షరంలో అంత అర్థం ఉంది చూశావా? ఎవరి హత్యగురించి నువ్వు మాట్లాడుతున్నావ్?"

"మీ నాన్నగారు పోయారుగద. ఆ విషయమే!"

నేను గజం ఎత్తయినా ఎగిరిపడ్డాను. భద్రం ఒక్కసారిగా నా కళ్ళు విప్పాడు! వాండ్రఫుల్! వాండ్రఫుల్! నాకు ఇంతదగ్గిరిగా, మా యింట్లోనే ఒకమనిషి పోతే నేను డిటెక్షను చెయ్యటం ఆలోచించేలేదు. ఆశ్చర్యం! హాత్యాశ్చర్యం!

"భద్రం! మిష్టరీ! పెద్దమిష్టరీ!"

"కాదండీ మరీ!" అన్నాడు భద్రం కళ్ళు పెద్దవి చేసి.

"భద్రం! భూతద్దం అందుకో! టేపు తియ్యి! ఈ మిష్టరీ అంతు ఇప్పుడే తేలుద్దాం." భద్రం వెంటనే జేబులో చెయ్యిపెట్టి భూతద్దమూ, టేపూ తీశాడు.

"ఇది పిక్కుపాకెట్టు కాలేదా?"

"లేదు. ఇది పెట్టిన పాకెట్టు పిక్కు కాలేదు."

మా నాన్న పోయింది ఉత్తరవేపు గదిలో. భూతద్దం చేతబట్టుకుని ఆ గదికి పరిగెత్తాను. మా నాన్న పడుకున్న మంచం ఉండినచోట గోడమీద భూతద్దం పెట్టి చూశాను. గోడమీద పాకే ఎర్రచీమ పెద్దదిగా కనపడింది.

"భద్రం! భూతద్దంలోంచి చూస్తే వస్తువులు పెద్దవిగా కనబట్టం మిష్టరీయా కాదా?"

"కాదుటండీ మరి!"

"ఈ గోడమీద — అవేమిటీ?— క్లూలు!— అవి అంతగా లేవు. ఒక ఎర్రచీమే ఉంది. అది కూడా ఇప్పుడు లేదు. మాయమయింది!"

"పోనీ నేలమీద చూడండి!"

"అసలు ఈ కేసు మన చేతికి ఆలస్యంగా వచ్చింది, భద్రం. మా నాన్న పోగానే పోలీసులు మనని ట్రంకు చేసినట్టుంటే క్లూలు తెగదొరికేవి!... ఉండు! భద్రం నోటుబుక్కు తీసి రాసుకో!"

నా ఆనందానికి మేరలేదు. జాగ్రత్తగా వెతికితే క్లూలు దొరక్కపోవు.

"రాసుకో భద్రం! కంటికి అక్షరాలు కనిపిస్తూనే ఉన్నాయిగాని, ఎందుకన్నా మంచిది, భూతద్దంతో చూస్తూ చదువుతాను నువ్వు రాసుకుంటూండు. 'కే!—రాశావా?"

"రాశానండి."

"తరవాతది, 'యూన్'—రాశావా? ఆ తరవాతది 'ఏ'. అంతే. ఇంకేమీ లేదు. అంతకు డిక్కడ

తన పేరు రాసి వెళ్ళాడు. భద్రం, వాడు ఎటుగా పరారీ అయి ఉంటాడంటావు?"

"ఈ గదికి ఉన్నదే ఒక్క వాకిలీ. ఇదుగో ఈ వాకిట్లోనించే పోయి ఉంటాడు. అవతలి గది ఎవరిది గురో?"

"నాదే భద్రం!"

"హరిసీ—"

"హాశ్చర్యం! అంతకుడు నా గదిలోకే వచ్చాడన్నమాట! నేనా వేళకు గదిలోనే ఉండి ఉండవచ్చు! ..భద్రం! రివాల్వరు పైకితియ్యి!"

"నాదగ్గిర రివాల్వరు లేదు గురోజీ!"

"చంపేశావ్! వాడింకా నా గదిలోనే ఉన్నాడేమో! రివాల్వరు లేందీ ఎట్లా పట్టుకుంటాం వాణ్ణి?"

భద్రం నాకేసి అదో మాదిరిగా చూసి, "వాడు అనేస్తున్నారు గురో! అప్పుడే మగవాడని తేలిపోయిందా ఏం? ఆడదెందుక్కాగూడదూ?" అన్నాడు.

నేను మళ్ళీ గజమెత్తు ఎగిరి పడ్డాను. నానోట మాట రాలేదు. వణుకుతున్న గొంతుతో "మా అమ్మే అయి ఉంటుందంటావా?" అన్నాను.

భద్రం నిష్కర్షగా "డిటెక్టివుకు తల్లీ, తండ్రీ అని ఉండకూడదు గురూ!" అన్నాడు.

"బాగా చెప్పావు భద్రం!" అన్నాను గుటక వేస్తూ. "ఎందుకన్నా మంచిది. ఆ పక్కగదిలో అంతకులున్నదీ లేనిదీ చూసి, లేకపోతే మా అమ్మను ప్రశ్నిద్దాం. కొంచెం గదిలోకి తొంగి చూడు!" అన్నాను.

భద్రం అడుగులో అడుగు వేసుకుంటూ వాకిలి దాకా వెళ్ళి నాగదిలోకి తొంగిచూశాడు. వాడు మళ్ళీ నాకేసి చూసినప్పుడు వాడిమొహాన నెత్తి వాటు వేస్తే కత్తిముక్క లేదు.

వాడు నా చెవిదగ్గిర నోరుపెట్టి రహస్యంగా, "గురోజీ, గదిలో ఎవరో స్త్రీ!" అన్నాడు.

నా వెనకే రమ్మని వాడికి సజ్ఞచేసి అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి, "హాండ్సప్!" అని అరిచాను.

ఆ మనిషి వొంగివున్నదల్లా లేచి నిలబడి నాకేసి తిరిగి, "అదేమిట్రా, నాయనా?" అన్నది. నా హాశ్చర్యం ఏమని చెప్పను? ఆమె ఎవరో కాదు, నా తల్లి! కాని తప్పదు! విచారణ జరిపి తీరవాలిసిందే.

"ఏమి చేస్తున్నావిక్కడ?" అని అనుమానితురాల్నడిగాను.

'నీ బట్టలేరా, బాబూ! మూటగట్టుతున్నా; ఇవాళేగా చాకలి వస్తాడూ?" అన్నది.

"వీల్లేదు!" అని అరిచా. తరవాత గొంతు తగ్గించి, "ఈ కేసు తేలేవరకూ ఏ వస్తువూ కదిలించటానికి వీల్లేదు. నేను నిన్ను కొన్ని ప్రశ్నలడగాలి చెప్పు! ఈ హత్యగురించి నీకు ఏమేమి తెలుసో దాచకుండా చెప్పుకురా!" అన్నాను.

"ఏడవకపోయావ్?" అంటూ ఆవిడ అవతలికి వెళ్ళిపోయింది.

నేను ఇప్పుడేం చెయ్యాలి? అనుమానితురాలు ఎక్కడన్నా డిటెక్టివ్‌తో ఇట్లా మాట్లాడటం ఉందా? అసలు డిటెక్టివును చూస్తూనే అంతకుడు నిజం ఎప్పుడు చెప్పేద్దామా అన్నట్టుండాలి. మా అమ్మ డిటెక్టివు పుస్తకాలు చదవకపోవటం చిక్కె అయింది.

"భద్రం, ఏంచెయ్యాలిప్పుడు?" అన్నాను.

"ఆ బట్టలమూటలో క్లూలుంటయి, గురో!"

"ఎంత బాగా చెప్పావు, భద్రం?" అంటూ విప్పాను. ఒక చొక్కా చేతికి దొరికింది.

"రాసుకో భద్రం. షర్టు, సహంచేతులు. మూడు బొత్తాములు. కుడి మోచేతి దగ్గిర చిరుగు. హా! దొరికాడు! కాలర్ మీద 'కేయాన్. ఏ.' అని రాసివుంది. దస్తూరి ఎవరిదో తరవాత చూడవచ్చు. రాసుకో, భద్రం! చొక్కా చేతిపొడుగు అరున్నర అంగుళాలు. చొక్కా పొడుగు 24 అంగుళాలు!...ఏం, భద్రం! కేసు విడుతున్నది కాదూ? అంతకుడు ఈ గదిలో నించి ఎట్లా బయటికి పోయి ఉంటాడంటావు? కిటికీలో నుంచి పోలేడు. చువ్వలున్నాయి...ఇదిగో ఈ దొడ్డివాకిలి గుండా పోయుండాలి. అవునా?"

"అవును, గురో!"

"దొడ్డో ఏమన్నా క్లూలు దొరుకుతాయంటావా?"

"హత్య జరిగి ఎంత కాలమయింది. గురో?"

'మాసికం కూడా అయిపోయిందిగా?"

"అయితే లాభంలేదు. గురో!"

"కేసు పోనివ్వటమే? ఎంత మాత్రం వీల్లేదు. నా బొందిలో ఊపిరుండగా...భద్రం! వొండ్రు ఫుల్!"

"ఏమిటది, గురో?"

"కుక్కలు!"

"ఏవి, గురో?"

"ఎక్కడ బడితే అక్కడే ఉన్నయి. భద్రం! మా యింటి పక్కనే చెవులు లేనికుక్క ఒకటుంది. వీథి చివర ఇంకో తెల్లకుక్కుంది. చాలవూ?"

"చాలకేం, గురోజీ?...ఎందుకనీ?"

"భద్రం, మొత్తానికి అసిస్టెంటు వనిపించావు. నీది మట్టి బుర్ర!"

"అంతే మరి! కుక్కల్ని పెంచుదామంటారా?"

"కాదురా! వాటిని ఉపయోగించి అంతకుణ్ణి పట్టుకుందాం!"

"అదా గురో? దానికి ఊరకుక్కలేం లాభం? జాతికుక్కలైతే—!"

"ఏడిశావ్, అన్నికుక్కలూ వాసన పడతయి. చూస్తావేం? వెంటనే వెళ్ళి రెండు కుక్కల్ని పట్టుకురా. మిగిలిన డిటెక్టపంతా నేను చేస్తాను."

అంతకుణ్ణి సమీపిస్తున్న కొద్దీ డిటెక్టివుకు కలిగే ఆనందం మామూలు మనిషి ఊహించలేడు. ఇది నా జీవితంలో మొదటి కేసని చెప్పవచ్చు. మా నాన్న జబ్బుచేసి చచ్చిపోయాడని లోకమంతా అనుకుంటున్నది. అది హత్య అని నాకూ భద్రానికీమాత్రమే తెలుసు. రెండు నిమిషాలలో భద్రం కుక్కలతోసహా వస్తాడు. కుక్కలు మమ్మల్ని సూటిగా అంతకుల దగ్గిరికి తీసుకుపోతాయి. పోలీసినస్పెక్టరుకు ధంగదిరిపోవాలె ఈ దెబ్బతో! రేపట్నించీ మనచుట్టూ కుక్కలాగా తిరుగుతాడు. ఎక్కడెక్కడ ఏ హత్యలు జరిగినా సరే చచ్చినట్టు ఇనస్పెక్టర్లంతా నన్ను ట్రంకు చెయ్యాల్సిందే!

అదుగో! భద్రం వచ్చేశాడు. ఎక్కణ్ణించో ఒక మచ్చల కుక్కను తెచ్చాడు.

"ఏం, భద్రం? ఇంకో కుక్కేదీ?" అన్నాను.

"ఏంచెయ్యను, గురో. మొత్తం మూడు కుక్కల్ని పట్టా. ఒకటి చిక్కితే ఒకటి పారిపోయింది. ఒకటి చాలదా?" అన్నాడు భద్రం.

"ఒక్క కుక్కతో అంతకుణ్ణి ఎక్కడన్నా పడతారా? రెండు కుక్కలు చెరొక క్లూ పట్టుకుని చెరొకదారీ పట్టాయనుకో. అది మరింత ఉసులు కాదూ? మనం ఇద్దరం ఉంటిమి. చెరొక కుక్క వెంటా పోవచ్చు. కాదూ?"

"నిజమే అనుకో, గురో. ఏం చెయ్యను? ముందు దీనికి ఒక క్లూ అందించి ఆతరవాత ఇంకో క్లూ అందిస్తాం. పని జరగాలిగద!"

"సరే పద!" అంటూ నా గదిలోకి దారి తీశాను. మచ్చల కుక్కను పట్టుకుని నా వెనకే నీడలాగా భద్రం వచ్చాడు. గుడ్డలమూట కుక్కకు వాసన చూపించి, "భద్రం, దాన్ని వదిలెయ్యి!" అన్నాను. భద్రం వదిలిపెట్టిన మరుక్షణం అది తోక ఆడించుకుంటూ గది బయటికి పోయింది. ఎంతో ఆశతో మేం దాన్ని వెంబడించాం. అది నేరుగా వంటింట్లోకి పోయింది.

మేం వంటింటి వాకిలిదగ్గిరికి వెళ్లేసరికి మా అమ్మకూడా వచ్చింది.

"గురో, ఆ తపేలాలో క్లూలుగాని లేవుగద?" అని భద్రం అనేటంతలో మాఅమ్మ, "ఛీ! ఛీ! మాలకుక్క!... నీ నోరు పడా!" అంటూ చేతిలోఉన్న కట్టెపేడుతో కుక్క వీపున ఒక్కటి పెట్టింది. అది కంయోమని అరుస్తూ మా కుక్కగా బయటికి దూసుకున్నది.

డిటెక్టపంతా పాడయిపోయినందుకు నేను విచారిస్తుంటే మా అమ్మ, "మీకేం కళ్ళులేవూ? అన్నం తప్పాలాలో అది మూతిపెట్టి తింటుంటే అట్లా చూస్తూ నుంచుంటారేం పొయ్యేకాలం?" అని మమ్మల్ని తిట్లు లంకించుకుంది.

ఇవతలికి వచ్చాక నేను భద్రంతో, "మన కుక్కను మా అమ్మ ఎందుకు కొట్టిందంటావ్?" అని అడిగాను.

"అనుమానించాల్సిందే, గురో!" అన్నాడు భద్రం.

"ఏమైనా మనం ఇటువంటి హావాంతరాలకు సిద్ధంగా ఉండాల్సిందే. నువ్వువెళ్ళి ఆ కుక్కను మళ్లీ పట్టుకురా!" అన్నాను.

భద్రం వెళ్ళాడు. వాడు వచ్చేలోగా నేను కేసు నెమరువేసుకున్నాను. ఆ పొడి అక్షరాలు చిరపరిచితంగానే ఉన్నాయి. మూటలో గుడ్డలు

కూడా బాగా ఎరిగున్నవిగానే ఉన్నాయి. ఆ చిరుగు! దాన్ని నేను ఎన్నోసార్లు చూసినట్టు జ్ఞాపకం!... నెత్తురు మరకలేవీ గుడ్డలమీద లేక పోవటం నేను గమనించకపోలేదు. ఇటువంటి కేసు నేను ఏ పుస్తకంలోనూ చూడలేదు. ఇద్దరు అనుమానితులు. అందులో ఒకతె డిటెక్టివు తల్లి. రెండోవాడు ఎవడైనాకానీ డిటెక్టివుకు బొత్తిగా అపరిచితుడు కాడు. వాడు ఎవడు? ఆలోచనతో బుర్ర వేడెక్కసాగింది.

ఇంతలో భద్రం తిరిగివచ్చాడు.

"కుక్కఏదీ, భద్రం?"

"ఇక అది నాకు చిక్కదు, గురో! నన్ను అంతదూరాన చూసే అది పారిపోతున్నది. మీరు చూస్తే ఒకచెయ్యి చూడండి!" అన్నాడు భద్రం.

ఎవరివల్లా కాని పనులు చెయ్యటానికే గదా డిటెక్టివుంట! నేను బయలుదేరాను. బయటికి వెళ్ళాను. అడుగులో అడుగువేసుకుంటూ వీధి అంతా తిరిగి చివరకు కుక్కను కనికట్టాను అది నన్ను చూడలేదు. వెనకగా వెళ్ళి దానిమీద పడి పట్టుకున్నాను. మరుక్షణం సినిమాలో ఒక స్క్రీను పోయి ఇంకో స్క్రీను వచ్చినట్టుగా అది నన్ను కరిచి పారిపోయింది.

నేను హాత్యాశ్చర్యంగా నిలబడ్డాను. నాకంతా అర్థమైపోయింది. నేనే అంతకుణ్ణని కుక్క పోల్చేసింది! కుక్క పొరపడదు! ఆ గోడమీది పొడి అక్షరా లెవరివి? నావి కావా? ఆ మూటలో షర్టు నాది కాదా?

దొరికిపోయిన అంతకుడి మనస్సు ఎట్లా ఉంటుందో నాకు అప్పుడర్థమయింది. బరువెక్కిన గుండెతో ఇంటికి తిరిగి వెళ్ళాను

"ఏం, గురో? కుక్కేదీ?" అన్నాడు భద్రం.

"దాని పని అది చేసేసింది. అంతకుడు దొరికాడు" అన్నాను.

"ఏడీ?" అన్నాడు భద్రం చుట్టూ వెతుకుతూ.

"నేనే ఆ అంతకుణ్ణి!" అన్నాను భద్రం కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"హాత్తెరీ—"

"కేసు ముగిసింది. ఇప్పుడు నీ సందేహాలు అడుగు - సమాధానాలు చెబుతాను" అన్నాను గంభీరంగా.

"అసలు క్లూం లేవీ!" అన్నాడు భద్రం.

"కేమాస్ ఏ అంటే ఎవరు?"

"హాత్తెరీ—"

"ఆ మూటలో చొక్కా తెచ్చి నాకు తొడిగి సరిపోతుందో లేదో చూడు" అన్నాను.

నేను చొక్కా తొడుక్కున్నాక భద్రం హాశ్చర్యానికి హంతు లేదు.

"కేసయితే తేలిపోయిందిగాని యిప్పుడేంటి చెయ్యటం?" అన్నాడు భద్రం.

"వెళ్ళి ఇనస్పెక్టరుతో చెప్పేస్తాను!"

"రైట్!" అన్నాడు భద్రం.

ఇనస్పెక్టరు నే చెప్పినదంతా శ్రద్ధగావిన్నాడు. చివర కాయన నన్ను భుజంమీద తట్టుతూ, 'నీలాంటి డిటెక్టివును నే నెక్కడా చూడలేదు" అన్నాడు.

"మా అమ్మ కూడా ఒక అనుమానితురాలని మీరు మరిచిపోతున్నట్టుంది" అని ఆయనతో అన్నాను గంభీరంగా.

"ఛీ ఛీ! ఎబ్బెబ్బే!" అన్నా డాయన.

"మీకు నా చాతనయిన సహాయం చేశాను. ఆపైన కేసు కండక్టరు ఎలా చేసేదే మీ భారం" అన్నాను.

సరిగా సమయానికి కాపు సారా కేసొకటి వచ్చింది.

"నాకు అర్జంటు పని ఉంది. మీరు ఇప్పటికి ఇంటికి వెళ్ళండి. మళ్ళీ మీతో పనిఒడ్డప్పుడు నేనే పిలిపిస్తాను!" అన్నాడు ఇనస్పెక్టరు.

"ఎప్పుడు కావాలన్నా నా సహాయం ఉండనే ఉంటుంది!" అన్నాను.

"ఛీ ఛీ! ఎబ్బే!" అన్నా డాయన మర్యాదగా.

నేను తేలికైన హృదయంతో ఇంటికి తిరిగి వచ్చాను. నా మొదటి కేసు! వొండ్రు ఫుల్! వొండ్రుఫుల్!